## గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

◆ కలెక్టర్ కోయ శ్రీహర్ష ◆ జోనల్ క్రీడా ముగింపు కార్యక్రమం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

మరికల్, అక్టోబర్ 16 : క్రీడల్లో గెలుపోటమిని సమానంగా స్వీకరించాలని, ఓటమి గెలుపునకు నాందికావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న 9వ జోనల్ పోటీల ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం అదృష్టంగా భావించాలని, గెలుపొందిన వారు ఆనందంగా ఉంటారని, ఓటమి చెందిన వారు నిరుత్సాహం చెందకుండా ఓటమికి కారణాలను అన్వేషించుకోవాలన్నారు. నారాయణ పేట, మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాల్లోని 11 గురుకుల పాఠశాలల నుంచి 935మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమని ఆన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చక్కటి చదువుతో పాటు క్రీడాల్లో కూడా నైపుణ్యం పెంచేందుకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు రోజులపాటు విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడంతో మంచి స్నేహ బరితమైన ఉత్సాహం ఉంటుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 21 ఈవెంట్లకు పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రాంతీయ సమన్వయ అధికారి ఫ్లోరెన్స్‌రాణి, జిల్లా అధికారులు దేవసేన, శ్రీవాణి, పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ, పీఈటీలు, పీడీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబురాలు



పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

నారాయణపేట రూరల్, అక్టోబర్16: జిల్లా కేంద్రంలోని హంసవాహిని ఉన్నత పాఠశాలలో సోమవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో బతుకమ్మను తంగేడు, బంతి, చామంతి, గునుగు, కలువ, మందారం తదితర పూలతో చక్కగా అలంకరించారు. హెచ్ఎం రాజేశ్‌తోపాటు ఉపాధ్యాయులు సుజాత, సంతోష్, తిరుపతి, నర్సింహ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు బతుకమ్మ చుట్టూ కోలాటం ఆడుతూ నృత్యాలు చేశారు. అనంతరం బతుకమ్మను కొండారెడ్డిపల్లి చెరువులో నిమజ్జనం చేశారు.

## రోగులకు మెరుగైన సేవలందించాలి

నారాయణపేట టౌన్, అక్టోబర్ 16: దవాఖానలకు వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.సౌభాగ్యలక్ష్మి అన్నారు. ఇటీవల డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన డా.సౌభాగ్యలక్ష్మిని సోమవారం పట్టణంలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పట్టణ డాక్టర్స్ అసోసియేషన్‌కు చెందిన వైద్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, కోశాధికారి గీత, వైద్యులు పద్మకళ, అక్షిత, సౌజన్య, విశ్వనాథ్, రాంబాబు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్యులు

# జనమంతా బీఆర్ఎస్‌వైపే..

◆ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గౌని సురేఖారెడ్డి

◆ భారీగా బీఆర్ఎస్ యువజన విభాగం బైక్‌ర్యాలీ



మరికల్‌లో బీఆర్ఎస్ బైక్ ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గౌని సురేఖారెడ్డి

మరికల్, అక్టోబర్ 16: జనమంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గౌని సురేఖారెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బైక్‌ర్యాలీని మండల కేంద్రంలోని మిత్ర రైస్ మిల్లు వద్ద జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ప్రారంభించారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో యువకులు బైక్‌లపై శేరివెంకటపూర్‌కు బయలుదేరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవికుమార్, యువజన విభాగం అధ్యక్షుడు రాజేశ్, సీనియర్ నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, హన్మిరెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతయ్య, కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు రాజవర్ధన్‌రెడ్డితోపాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కడపరాయుడి ఆలయం మెట్లపై పసుపు, కుంకుమతో పూజలు చేస్తున్న తిమ్మయ్యగౌడ్

***బైక్ ర్యాలీకి భారీగా తరలివెళ్లిన కార్యకర్తలు***

నారాయణపేట రూరల్, అక్టోబర్16: పేట మండలంలోని అప్పక్‌పల్లి, జాజాపూర్, సింగారం, శేర్నపల్లి, అప్పిరెడ్డిపల్లి, కొల్లంపల్లి, కోటకొండ, బోయిన్‌పల్లి, పేరపళ్లతోపాటు అన్ని గ్రామాల నుంచి సోమవారం పేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి చేపట్టిన బైక్‌ర్యాలీలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. మొదటగా దామరగిద్ద మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు జగన్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్ష, కార్యదర్శులు రాములు, రవీందర్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, ముఖ్య నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతు, మధూసూదన్‌రెడ్డి, రవినాయక్, మోహన్‌నాయక్, రాజు, సాయిరెడ్డి, వెంకట్‌నాయక్, శంకర్‌పాల్గొన్నారు.

***ధన్వాడ మండలంలో..***

ధన్వాడ, అక్టోబర్ 16: ఎమ్మెల్యే ఎస్.ఆర్ రెడ్డికి మద్దతుగా యువజన విభాగం చేపట్టిన బైక్ ర్యాలీకి మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తరిలివెళ్లారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించాలని కోరుతూ గున్‌ముక్ల బీఆర్ఎస్ నాయకుడు తిమ్మయ్యగౌడ్ గున్మక్ల కడపారాయ ఆలయం మెట్లపై పసుపు, కుంకుమ పూసి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం కార్యకర్తలు నారాయణ పేటకు తరలివెళ్లారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు వాహిద్, మాజీ జెడ్పీటీసీ వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ విమల, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



కోయిలకొండ: బైక్‌ర్యాలీకి హాజరైన కార్యకర్తలు



ధన్వాడ నుంచి తరలివెళ్తున్న నాయకులు



జాజాపూర్ నుంచి బైక్ ర్యాలీకి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

## పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి

◆ కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, అక్టోబర్ 16: ఎన్నికల అనంతరం పట్టణ శివారులోని శ్రీ దత్త బీఎడ్ కళాశాలలో ఈవీఎం యంత్రాలను భద్రపరచడంతోపాటు అక్కడే కౌంటింగ్ చేయనున్నట్లు కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. సోమవారం శ్రీదత్త బీఎడ్ కళాశాలను పరిశీలించారు. కళాశాల వద్ద పటిష్ట భద్రతకు సంబంధించి కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఏవో నర్సింగరావు పాల్గొన్నారు.

***నిబంధనలు పాటించాలి..***

ఎన్నికల నిబంధనలు సక్రమంగా పాటించాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 9నుంచి నేటివరకు జిల్లాలో 12 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు పనిచేశాయన్నారు. అదేవిధంగా 12 ఎఫ్ఎస్‌టీ, 12 ఎస్ఎస్‌టీ, 2 వీఎస్‌టీ, 2 వీవీటీ, 12 ఎంసీసీ టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.20లక్షలు సీజ్ చేశారని, గ్రీవెన్స్ ఎంసీసీ వ్యాలెట్ టీంకు సరైన ఆధారాలు సమర్పిస్తే పరిశీలించి ఆ డబ్బును విడుదల చేస్తామన్నారు. మిగతా వాటిని ట్రెజరీలో జమచేయనున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా నడుస్తున్న 150 బెల్టు షాపులను మూసివేయించామని, బ్యాంకులలో అనుమానాస్పదంగా రూ.10లక్షలకుపైగా జరిగిన లావాదేవీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. లైసెన్స్‌గా ఉన్న 96తుపాకులను డిపాజిట్ చేశామన్నారు. కంట్రోల్ రూంకు 26 ఫిర్యాదులు, సీ విజిల్‌కు 2 ఫిర్యాదులు వచ్చాయని, వాటన్నింటిని పరిశీలించి పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కోడ్ ఆఫ్ కండక్ట్ ఉన్న కారణంగా గోడల మీద, ప్రభుత్వ భవనాల మీద పార్టీలకు సంబంధించి పోస్టర్లు అతికించరాదన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 7చెక్‌పోస్టులతో 2,153 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు. శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకారం అందించాలన్నారు.

## ధన్వాడ ఉన్నత పాఠశాలలో అగ్నిప్రమాదం

ధన్వాడ, అక్టోబర్ 16: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని వెనక భాగం తరగతి గదిలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. దీంతో రూ.7లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని హెచ్ఎం శెట్టిరమేశ్ తెలిపారు. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా, లేదా ఎవరైన ఉద్ధేశపూర్వకంగా చేశారనేది తెలియడంలేదని పేర్కొన్నారు. ఉదయం పాఠశాల నుంచి మంటలు రావడంతో ఎంపీటీసీ ఉమేశ్‌కుమార్ అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపు చేశారు. ఘటనలో 12 కంప్యూటర్లు, 14 పాత కంప్యూటర్లు పూర్తిగా కాలిపోయాయని, తరగతి గదిలో ఫర్నీచర్ పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. ఎస్సై రమేశ్ సందర్శించి ఆరా తీశారు.

## భారీగా పట్టుబడ్డ నగదు

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), అక్టోబర్ 16: అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో అధికారులు, పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. సోమవారం చిన్నచింతకుంట మండలంలోని బండర్‌పల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసి చెక్‌పోస్ట్‌లో ఎస్సై శేఖర్ సిబ్బందితో నిర్వహించిన తనిఖీలో భారీ మొత్తంలో నగదు బైటపడింది. ఆరుగురికి చెందిన రూ.35,49,900 నగదు దొరికినట్లు ఎస్సై తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో నగదును సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## రూ.5లక్షలు స్వాధీనం

మరికల్, అక్టోబర్ 16: అక్రమంగా కారులో తరలిస్తున్న డబ్బుతోపాటు లిక్కర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరికల్ పోలీసులు సోమవారం మండలకేంద్రంలోని సబ్ స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించగా మహబూబ్‌నగర్ నుంచి నర్వకు కారులో వెంకటరాజు రూ.3లక్షలు, దేవరకద్ర నుంచి రాయచూర్‌కు శ్రీశైలం రూ.50,500 అనుమతి లేకుండా తరలిస్తుండగా మరికల్ ఎస్సై హరిప్రసాద్ రెడ్డి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఎలిగండ్లకు చెందిన శేఖర్ గౌడ్ ఆటోలో రెండు కాటన్ల మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. మద్యం విలువ రూ.19వేలు ఉంటుందని తెలిపారు. పట్టుబడ్డ నగదును జిల్లా ట్రెజరి, మద్యాన్ని ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. దామరగిద్ద మండలంలోని కానుకుర్తి చెక్‌పోస్టు వద్ద బైక్‌పై రూ.లక్షా50వేల నగదు తీసుకెళ్తుండగా.. సరైన పత్రాలు లేనికారణంగా సీజ్ చేశారు.